# స్నేహం

సురేష్ నా గదికి వస్తాడని నేను కలలో కూడా ఊహించలేదు. కారణం... సురేష్ లాంటి వాళ్లు నా జీవితంలో ఇప్పటివరకూ ఎంతో మంది తారసపడ్డారు. కానీ ప్రతివాళ్లూ నా శరీరసౌష్టవాన్ని, వంపుసొంపుల్ని, యవ్వన బిగువుల్నీ కొంటెచూపుల్తో స్పృశించేవారే తప్ప ఆత్మీయంగా పలకరించినవాళ్లు, నిజమైన స్నేహితులుగా నిలబడ్డవాళ్లూ ఎవ్వరూ కన్పించలేదు.

నా రంగు, కులం నన్ను అలా దూరంగా ఉంచాయేమో తెలియదు. ఎవరి గురించో ప్రత్యేకంగా చెప్పడం ఎందుకు? ఇంట్లో నాన్న, నా తోబుట్టువులు సైతం నా రంగుని విమర్శించే వాళ్లే.

అమ్మ నల్లగా ఉంటుంది. అమ్మ రంగుతో పాటు శరీరసౌష్టవం కూడా నాకు వచ్చాయి. కన్నకూతురి రంగునే అసహ్యించుకున్నట్లుగా చూసే నాన్న మరి అప్పట్లో అమ్మని ఎట్లా చేసుకున్నాడో తెలియదు. ఈ విషయం అమ్మని అడగడానికి కూడా ఎప్పుడూ సాహసం చేయలేదు.

బహుశా తాతయ్య లక్షలకొద్దీ కట్నం గుమ్మరించి అమ్మని వదిలించుకుని ఉంటాడు. లేకుంటే ఎట్టిపరిస్థితుల్లోనూ అమ్మని పెళ్లిచేసుకోవడానికి ఒప్పుకునే మనస్తత్వం కాదు నాన్నది. అమ్మ యిన్నాళ్లూ అనుభవించిన మానసికవ్యథని, ఈ వయస్సులో నేను అర్థంచేసుకోగలను. అమ్మ మాత్రం ఎప్పుడూ నాన్న గురించి చెడుగా చెప్పిన సందర్భాలు లేవు. తండ్రి వ్యక్తిత్వం గురించి చెప్పి, పిల్లల మనస్సుల్లో విషబీజాలు నాటకూడదన్నది ఆవిడ మనస్తత్వం కావచ్చు.

నా విషయంలోను, నా పెళ్లి విషయంలోనూ నాన్న ప్రవర్తిస్తున్న తీరుకు మానసికంగా అమ్మ ఎంతగానో కృంగిపోయింది. ఇంట్లో నేను పెద్దదాన్నయినా, చెల్లి - తెల్లగా, అందంగా ఉంటుందని, లక్షలకొద్దీ కట్నంపోసి చెల్లిని ఒక డాక్టర్‌కి ఇచ్చి పెళ్లిచేసాడు నాన్న.

సమాజంలో చెల్లి భర్తకి డాక్టరుగా ఎంతో గౌరవం ఉన్నా నా దృష్టిలో అతను సంస్కార హీనుడు. ఏదో ఒక సందర్భం కల్పించుకుని పదే పదే ఇంటికి రావడం, అసందర్భ సంభాషణలు, పనికిరాని జోకులు పేల్చి అదేపనిగా నన్ను చూస్తూ గుటకలు మ్రింగేవాడతను. ఆ పాడుచూపులు భరించలేక సాధ్యమయినంత వరకూ వాళ్లకి దూరంగా ఉండడానికి ప్రయత్నించేదానిని. చెల్లి జీవితం చూసి అసూయ

డా॥ కె.ఎల్.వి.ప్రసాద్



పడ్తున్నానని నలుగురూ అనుకుంటారేమో నని తప్పని పరిస్థితుల్లో అప్పుడప్పుడూ అతన్ని పలకరిస్తుండేదాన్ని. అతని వెకిలిచూపులు, వికృత నవ్వులూ నాకు అసహ్యాన్ని కలిగించేవి.

ఒక్క రంగులో తప్ప అన్ని రకాలుగా నేనే బావుంటానని నన్ను చూసిన మా బంధువులంతా అంటుండేవారు. అయినా ఏమి లాభం? సమాజంలోనే కాదు... ఇంటిల్లపాదికీ (అమ్మకి తప్ప) నేనొక నల్లపిల్లని; అనాకారిని!

* * *

సురేష్ చాలా అందంగా ఉంటాడు. నన్ను నేను తగ్గించుకుని, సురేష్ అందచందాలను అంచనా వేయడం కాదు కాని, అతను నిజంగా అందగాడే! విశాలమైన ఛాతి, మిలమిల మెరుస్తూ - ఎప్పుడూ నవ్వుతున్నట్లు

కన్పించే కళ్లు, చూడచక్కని చలాకీతనం, స్లిమ్‌గా కన్పించే నడుం... చూడగానే సర్వేంద్రియాలూ స్పందించే విధంగా సర్వాంగాలూ పట్టుతప్పి నట్లుగా అన్పిస్తుంది. వీటన్నిటికీ తోడు అంద మైన శరీర ఛాయ, గిరజాల జుత్తు, చెరగని క్రాపు... ఈ రోజుల్లో సినిమా హీరోలకు కూడా లేని అందాలు సైతం అతనిలో ఉన్నట్లనిపి స్తుంది.

ఎందుచేతనోగానీ అతను మాట్లాడుతుంటే నే నా శరీరంలో ఏదో విద్యుత్తు ప్రవహించిన ట్లవుతుంది. నా ముప్ఫయి ఏళ్ల జీవితంలో సురే ష్ లాంటి మగాడిని ముఖంలో ముఖంపెట్టి ధైర్యంగా చూసి ఎరగను.

నాకు ప్రమోషన్ వచ్చిందని తెలిసి నా సీటు దగ్గరకు వచ్చాడు సురేష్. అందరూ చూస్తుండ గానే నా చేతిలో చేయికలిపి నాకు అభినందన లు తెలియజేసాడు. అతను షేక్‌హేండ్ యిచ్చిన పుడు చెప్పొద్దూ...! ఊహించని తన్మయత్వంతో నా శరీరం మొద్దుబారిపోయింది.

యౌవ్వనంలోకి ప్రవేశించిన తరువాత పురుష స్పర్శ ఎలాంటిదో తెలీదు నాకు. కేవలం అతని చేతి స్పర్శ నాలోని నవనాడుల్నీ స్పందిం పజేసింది. పరిస్థితులనుబట్టి నాలో అణచబడ్డ సాధారణ ఆడపిల్లల్లో వయసుని బట్టి రగిలే కోర్కెలు ఒక్కసారిగా రేసుగుర్రంలా పరిగెత్తడం మొదలుపెట్టాయి. ఉన్నట్టుండి నాలోని స్త్రీత్వం కస్సున బుసకొట్టడం మొదలుపెట్టింది.

ఆనాటి నుంచి అతని కోసం, అతని స్పర్శ కోసం, అతని మృదువైన మాటల గిలిగింతల కోసం హాయన్పించే అతని చల్లని చూపుల కోసం నా తనువు తపించిపోవడం మొదలు పెట్టింది.

ఆ చిన్న సంఘటన జరిగిన నాటి నుంచి ఇద్దరం ఎక్కడో ఒకచోట కలుసుకుంటూనే ఉ న్నాం. కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం. మా యిద్దరి మధ్య ఏర్పడిన చనువు, స్నేహం ఆఫీసులో కొందరికి ఆసక్తికరమైన అంశంగా తయారయింది. వాళ్ల ఆశ్చర్యపు చూపులు, నొస లు చిట్లింపులు నా గుండెల్లో సూదులను గుచ్చు తూనే ఉన్నాయి. గతంలో సంగతి చెప్పలేను గాని, యిప్పుడు యివన్నీ నేను పట్టించుకునే స్థితిలో లేను. నా గురించి, నా బాగోగుల గురిం చీ పట్టించుకుని చర్చించే మంచి స్నేహితుడు దొరికాడనే తృప్తి నాలో చైతన్యాన్ని మరింతగా పెంచింది.

అలా అని మేము హద్దులుదాటి ప్రవర్తిం చిన సంఘటనలు ఎప్పుడూ లేవు. అందుచేతనే నేమో బయటివాళ్ల వంకరచూపులు, వెకిలి చేష్టలూ చిన్నగా సద్దుమణగడం మొదలు పెట్టాయి. 'ప్రేమ' అనే పదం అర్థం కోసం యిరు హృదయాలూ అదేపనిగా తపించిపో తున్నాయ్.

* * *

నా సంపాదనతోనే సంసారాన్ని లాక్కొస్తున్న నాన్నలో నా వయస్సు పెరుగుతున్న విషయం గాని, నాలో యవ్వనం ప్రవేశించిన విషయం గాని, నాకు పెళ్లి చేయాలన్న ఆలోచనగానీ ఉ న్నట్లు కన్పించడంలేదు.

ఈ పరిస్థితిలో నేను ఆయనకు బంగారు బాతు మాదిరిగానే కన్పించాను. అనవసరంగా నన్ను వదులుకొని, నా సంపాదన వదులుకొని పస్తులు పడుకునే పరిస్థితిలో ఆయన లేడు. నా గురించి, నా ఆనందం గురించి, నా సుఖం గురించి, నా భవిష్యత్ గురించీ ఆలోచన అయ న మెదడులోకి చొచ్చుకుపోలేకపోయింది.

నా కంటే చిన్నవాళ్లయిన చెల్లి పెళ్లి, తమ్ము

డి పెళ్లీ నా సంపాదనతోనే పూర్తిచేసాడు నాన్న. ఆయన కంటూ వచ్చే నెలసరి పెన్షన్ ఆయనకు అలవాటయిన విలాసాలకే సరిపోదు. అందుకే పంజరంలోని పక్షి అయింది నా బ్రతుకు. సెంటీ మెంట్ల వంకతో నా రెక్కలు కదలకుండా కట్టి పడేసాడు నాన్న.

ఇప్పటికే చాలా కాలం కరిగిపోయింది. ఇపుడు నాకు స్వేచ్ఛ కావాలి. నా బతుకు నేను స్వంతంగా బతకాలి. ఇన్ని బాధలు పడ్డాక యిప్పుడు నాకు ఒంటరితనం పెద్ద లెక్కలోనిది కాదు. అందుకే నాన్నతో పోట్లాడి మరీ ఇల్లు వదిలి బయటికి వచ్చేసాను. అమ్మ ఇల్లు వదిలి వెళ్లవద్దని బ్రతిమాలింది, ఏడ్చింది. ఆమె ఆలో చన వేరు, ఆవేదన వేరు. అయినా ఏ పనీ ఆవిడతో అయ్యేది కాదు. కానీ నా నిర్ణయం అమ్మని విపరీతంగా బాధపెట్టింది. ఆమె మూగ రోదన మానసికంగా నన్ను కృంగదీసింది. అయినా తప్పలేదు. నా నిర్ణయం అక్షరాలా అమలుపరచవలసి వచ్చింది. ఆఫీసుకి దగ్గర లోనే మంచి ఇల్లు అద్దెకు తీసుకున్నాను. అందు కే నిర్భయంగా సురేష్‌ని ఇంటికి ఆహ్వానిం చాను.

*       *       *

శ్వేత నన్ను వాళ్ల ఇంటికి ఆహ్వానిస్తుందని ఊహించలేదు నేను. ఆఫీసులో తన పనేదో తాను చేసుకుంటూ రిజర్వ్‌డ్‌గా ఉండే శ్వేత నన్ను 'టీ'కి పిలవడం నిజంగానే ఆశ్చర్యమని పించింది. అయితే తను పిలిచినట్లు ఆఫీసులో ఎవరికీ చెప్పవద్దంది. తన భయం తనది మరి!

చూడ్డానికి నాకంటే శ్వేత వయస్సు కాస్త ఎక్కువగా ఉన్నట్లు అన్పిస్తుంది. అయినా ఆమె శరీరంలో ఎక్కడా అలాంటి ఆనవాళ్లు మాత్రం కన్పించడంలేదు. ఆమె నల్లగా, సన్నగా ఉం టుందని ఆఫీసులో అందరూ ఆమెని చులకన గా చూస్తారు. నల్లగా ఉండడం అనేది అందా నికి మైనస్ మార్క్ అని నేను అనుకోవడం లేదు. బాహ్యసౌందర్యం తాత్కాలికమైనదని ఎందరికి తెలుసు? ఎందరిలోనో లేని అందాలు ఆమెలో ఉన్నాయి. ఒక్క శరీరం రంగు తప్ప అందరికీ సరిపడ లక్షణాలన్నీ ఆమెలో ఉన్నా యి.

ఆమె శరీరఛాయని గురించి విమర్శించే వాళ్లకి ఆమె కులం కూడా తోడయింది. దళిత కుటుంబంలో పుట్టడమే ఆమె చేసుకున్న పాప మా? ఆమెని సరిగ్గా అర్థంచేసుకున్నవాళ్లెవరూ ఆమె పరిచయాన్ని వదులుకోలేరు. నిజమైన అందాన్ని ఆస్వాదించగల ధైర్యం ఉన్నవారెవరూ ఆమెని నిర్లక్ష్యం చేయరు.

నేను కాలేజీలో చదువుకుంటున్నపుడు ప్రేమ, దోమ అంటూ ఎంతోమంది ఆడపిల్లలు నాచుట్టూ తిరిగేవారు. అయినా నేనెప్పుడూ ఎవ రివంకా కన్నెత్తి చూసేవాణ్నికాదు. ఆనాటి నా ప్రవర్తన గురించి ఆలోచిస్తే ఇప్పటికీ ఆశ్చర్యం అన్పిస్తుంది.

ఎన్నో ఎత్తులు, పైఎత్తులు వేసి విసిగి వేసా రిపోయిన అందమైన ముద్దుగుమ్మలు నాలో ఏదో లోపం ఉందని ప్రచారంచేసి, నా మగ తనం మీదే దెబ్బకొట్టబోయారు. అది నిజంగానే నా సున్నితమైన మనసుమీద పెద్ద దెబ్బ కొ ట్టింది.

ఆ తర్వాత ఉద్యోగం కోసం వేట; ఉద్యోగం లో స్థిరపడ్డం, తద్వారా యాంత్రిక జీవితానికి అంకురార్పణ జరిగిపోయింది. ఆఫీసులో ఎప్పు డూ ఎవరితోనూ చనువుగా తిరగని, మాట్లాడని శ్వేత నాకు తెలియకుండానే నా మనసుని దోచు కుంది. ఆ విధంగా ఆమె కనుసన్నల్లో పడడా

నికి, ఆమెతో స్నేహం పెంచుకోవడానికీ విశ్వ ప్రయత్నం చేసాను. ఆమెలోని నిజాయితీ, ఆత్మ సౌందర్యం, నన్ను ఆమెపట్ల ఆకర్షితుణ్ణి చేసాయి. ఒకరకంగా చెప్పాలంటే ఆమె స్నేహాన్ని గెలుచుకోవడంలో నేను కృతకృత్యుడినయ్యాను.

అమ్మ, నాన్న నాకు పెళ్లి గురించి చెప్పి చెప్పి విసిగిపోయారు. నేను పెళ్లి చేసుకోవడం లేదన్న బెంగ వాళ్ల మనస్సుల నిండా నిండిపోయిఉంది. బ్రతికుండగానే వంశోద్ధారకుణ్ణి చూడాలన్నది వాళ్ల ఆశ.

ఒక వయస్సంటూ వచ్చాక పెళ్లి చేసుకోవాలని అందరికీ ఉంటుంది. కానీ కొందరి విషయంలో అది సఫలీకృతం కాదు. కాలం కలిసి రాకపోయినా, పరిష్కారం దొరకని సమస్యలు ఎదురైనా అనుకున్నది సాధించడం కష్టమే మరి. నేను కూడా ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్న విషయం వాళ్లకి తెలియదు. ఇవన్నీ వాళ్లకి తెలిస్తే వాళ్ల ఆయుష్షు ముందుగానే అరచేతిలోకి వచ్చేస్తుంది. అందుకే ఈ బాధలు ఎదుర్కోలేక ఇంటికి వెళ్లడం కూడా తగ్గించేసాను. వాళ్లు మాత్రం నన్ను అపార్థం చేసుకుని ఒక అసమర్థుడిగా లెక్కకట్టేసారు. నిజానికి ఇలా ఆలోచించడంలో వాళ్ల తప్పు కూడా లేదు.

శ్వేత పరిచయం నాలో నిద్రాణమైన యవ్వనాన్ని, కాలరాసిన కోర్కెలనూ మేల్కొలిపిందనే చెప్పాలి. నా మనస్సు నా అదుపుతప్పి ప్రవర్తిస్తుందేమోననిపిస్తుంది. అయినా ఆమెతో పరిచయం నాకు పెద్ద రిలీఫ్ యిచ్చినట్లయింది. అలాగే నన్ను చూడకుండా ఉండలేని పరిస్థితి ఆమెకు కూడా ఎదురయింది. ఆమె సహృదయంతో అందించిన ఆహ్వానంతో నాలో ఇంత వరకూ బిగుసుకుపోయిన నరాల పట్టు ఒక్కసారిగా సడలినట్లయింది. శరీరం దూదిపింజలా తేలికయిపోయి ఊహాలోకంలో ఎగిరిపోవడం మొదలుపెట్టింది. నేను ఆమెపట్ల అతిగా ప్రవర్తిస్తున్నానేమో! అర్హతకు మించి ఆలోచిస్తున్నానేమో!! అన్న శంక కూడా ఒక ప్రక్క నా మనస్సుని సున్నితంగా గిచ్చుతూనే ఉంది. అయినా ధైర్యంచేసి శ్వేత ఆహ్వానం సద్వినియోగం చేసుకోవడానికే నిర్ణయించుకున్నాను.

* * *

సురేష్ గురించిన నా ఎదురుచూపులు ఏ మాత్రం వృధాకాలేదు. చెప్పినట్లుగానే వచ్చి మాట నిలబెట్టుకున్నాడు. దీనితో అతనిపై నమ్మకం మరింత పెరిగినట్లయింది. అసలే అందగాడేమో... సిల్క్ కుర్తా, పైజామాతో మరింత అందంగా మెరిసిపోతున్నాడు.

తలుపు తీసి ఉండడంతో సరాసరి డ్రాయింగ్రూమ్‌లోకి వచ్చేసాడు సురేష్. అప్పటికి నేనింకా బాత్‌రూమ్‌లోనే ఉన్నాను. వచ్చింది సురేష్ అని రూఢి చేసుకున్న తరువాత 'వచ్చేస్తున్నా... కూర్చోండి...' అని బాత్‌రూమ్ నుంచి చిన్నగా కేకపెట్టాను.

సురేష్ రాకతో నా మనస్సంతా ఆనందంతో నిండిపోయింది. వంటరిదాన్నన్న ఆలోచన నా మనస్సు నుంచి పారిపోయింది. ఆ క్షణంలో నేనేమయిపోతున్నానో, ఏమి చేస్తున్నానో నాకే తెలియడంలేదు. ఈ హడావిడిలో ఎంత మునిగ్దామన్నా నా స్నానం ఓ పట్టాన పూర్తికావడం లేదు. శరీరం - స్పృశించని గిలిగింతలతో తేలికయిపోతున్నది.

ఎన్నడూ మదిలోకి రాని ఊహలు నా శరీరాన్ని వేడెక్కించి, మత్తులో ముంచేస్తున్నాయి. వింతకోర్కెల తాలూకు ఆలోచనలు శరీరం నుంచి వేడిపొగలు కక్కుతున్నాయి. శరీరం, మనస్సు నా అదుపు తప్పుతున్న భావన నాలో

మొదలయింది.

అయినా ఒక స్నేహితుణ్ని మర్యాదగా ఒక కప్పు 'టీ' కలిసి త్రాగడానికి పిలిచిన నేను ఈ రకంగా ఆలోచన చేయడం ఏమిటి? అతను ఏమనుకుంటాడు? క్షణంలో నా మనస్సుని స్వాధీనంలోకి తెచ్చుకుని, త్వరత్వరగా స్నానం ముగిసిందనిపించాను. నైటీ తగిలించుకున్నాను. ఆ సమయంలో నా పరిస్థితి అయోమయంగా తయారైంది. ఎంత కాదనుకున్నా నా వింత ఆలోచనలకు కళ్లెం వేయలేకపోతున్నాను.

ఇది నా జీవితానికి ఒక సరికొత్త అనుభవం. డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిలబడి తల దువ్వుకుని, ముందే కొని తెచ్చుకున్న మల్లెపూలు జడలో తురుముకుని లైట్‌గా ఫేస్‌పౌడర్ రాసుకున్నాను.

ఆ రోజు నర్సాపూర్ లేస్‌తో ప్రత్యేకంగా కుట్టించుకున్న తెల్లని మల్లెపూవు లాంటి నా రాత్రిగౌను చూడ్డానికి నాకే ఎంతో ముచ్చటగా ఉన్నట్లనిపించింది. ఫ్లాస్క్‌లో రెడీగా ఉంచిన 'తేనీరు' రెండు కప్పుల్లో పోసి సురేష్ కూర్చున్న డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లాను.

సురేష్ చాలా సీరియస్‌గా అక్కడ ఉన్న తెలుగు వీక్లీ చదువుతున్నాడు. అతను చదువుతున్న కథ తాలూకు బొమ్మచూసి నాలో నేనే నవ్వుకున్నాను. అతనికి దగ్గరగా కుర్చీలాక్కుని -

"సారీ ఫర్ ది లేట్" అన్నాను నవ్వుతూ.

"మీరు కాదు... నేనే చెప్పాలి సారీ... మీకు నేనిచ్చిన సమయం దాటిపోయింది కదా!" అన్నాడు సురేష్ కూడా నవ్వుతూ.

"ఫరవాలేదు. ముందు మీరు టీ తీసుకోండి" అన్నాను టీ కప్పు అతని చేతిలో పెడుతూ.

సురేష్ మెల్లమెల్లగా టీ సిప్‌చేస్తూ అప్పుడప్పుడూ నా వంక చూస్తున్న విషయం నేను గమనించకపోలేదు. అతని చూపులు తెలియకుండానే నా శరీరంలో చెప్పుకోలేని చోట్ల వాడిగా, వేడిగా గుచ్చుకుంటున్నాయ్. ఓ పది నిమిషాలు పిచ్చాపాటీ మాట్లాడుకున్న తరువాత -

"ఇక్కడ ఫాన్ లేదు. ఉక్కగా లేదూ! లోపల కూర్చుందామా?" అన్నాను అతని ముఖంలోకి చూస్తూ.

"ఆ... గాలి బాగానే వస్తోంది కదా యిక్కడ" అన్నాడు మొహమాటంగా సురేష్.

"నాకు మాత్రం ఇక్కడ బాగోలేదుబాబూ" అన్నాను చొరవగా.

"ఓకే. మీరు చెప్పినట్లే కానివ్వండి" అన్నాడు మృదువుగా సురేష్.

"మీరు... గీరు... అక్కరలేదు. హాయిగా శ్వేతా అని పిలవండి. నువ్వు అని సంబోధిస్తే ఇంకా ఆనందంగా ఉంటుంది" అన్నాను అతని వంక తదేకంగా చూస్తూ.

నావంక ఆరాధనగా, ప్రేమగా చూస్తూ కాస్సేపు పకపక నవ్వాడు సురేష్. ఇద్దరం నవ్వుకుంటూ లోపలిగదిలోకి వెళ్లాం. అతను గదంతా ఒకసారి కలియతిరిగి వింతగా చూసాడు. నా బెడ్ ప్రక్కనే ఉన్న ఫేమ్‌కుర్చీ సరిచేసుకుని అందులో కూర్చున్నాడు. అతనికి ఎదురుగా నేను మంచంమీద కూర్చున్నాను.

"నీ బెడ్‌రూమ్ చాలా బాగుంది శ్వేతా!" అన్నాడు మెచ్చుకోలుగా సురేష్.

"థాంక్స్. మీకు నచ్చితే అదే పదివేలు" అన్నాను నవ్వుతూ.

"ఆ... అదేమిటి?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"అవును మరి... మీరు లేకలేక దొరికిన నా శ్రేయోభిలాషి కదా" అని పకపకా నవ్వే

సాను. సురేష్ కూడా నాతో శృతి కలిపాడు.

కాస్సేపు ఆఫీసు కబుర్లు, రాజకీయాలూ మాట్లాడుకున్నాక కాసిన్ని జోకులతో కడుపుబ్బ నవ్వుకున్నాక -

"అక్కడ అంత కంఫర్ట్‌గా లేనట్లుంది... ఇక్కడ కూర్చోండి" అని ధైర్యంగా చేయిపట్టి లాగి, బెడ్‌మీద నా ప్రక్కనే కూర్చోబెట్టుకున్నాను. అతను ఎలాంటి అభ్యంతరమూ వ్యక్తపరచ లేదు. పైగా నా చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు. ఆ చిరుస్పర్శకు నా హృదయం స్వర్గలోకాలకు ద్వారం తెరిచినట్ల యింది. అదే సమయంలో అతని శరీరంలో కోటి ఓల్టుల విద్యుత్ ప్రవహించినట్లయింది. అతనికి తెలియకుండానే అతని పెదవులు, చేతు లు వణుకుతున్నాయి. వాటిని కప్పిపుచ్చుకోవ డానికి అతను విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

ఆడపిల్లనయివుండి కూడా నాలో వూహిం చని మొండిధైర్యం నన్ను మరింత ముందుకు పొమ్మని ప్రోత్సహించింది.

సురేష్‌ని మెల్లగా నా వైపుకు తిప్పుకుని అ తని బుగ్గపైన సున్నితంగా ముద్దుపెట్టుకున్నాను. ఊహించని ఈ పరిణామానికి అతను ఆశ్చర్య పోయాడు. అతని కళ్ళు మత్తుతో మూసుకు పోవడం నాకు స్పష్టంగా కన్పించింది. అతని చూపులు నా శరీరంలో ఆరని మంటలను రేప డం మొదలుపెట్టాయి. మెల్లగా లేచి, అతని తలను మెత్తని తలగడపై వాల్చి ముందుగదికి బోల్టువేసి వచ్చాను. సురేష్ ప్రక్కగా మంచం అంచున కూర్చుని అతని వత్తయిన ఉంగరాల జుత్తులో నా చేతివేళ్ళు దూర్చి అప్యాయంగా నిమరసాగాను. అతను అమాంతంగా నన్ను తన మీదకి లాక్కున్నాడు. నా తలను గట్టిగా ఒడిసి పట్టుకుని పెదవులను మృదువుగా చుం బించాడు. నా గుండె ఝల్లుమంది. నన్ను అత ని హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు.

* * *

బయట జనం అలికిడికి నాకు మెలుకువ వచ్చింది. ప్రక్కకు తిరిగి చూసాను. సురేష్ లేడు. బాత్‌రూమ్‌తో పాటు ఇంటి బయట కూ డా చూసాను. సురేష్ జాడలేదు. ఒక ప్రక్క ఆశ్చర్యం, మరో ప్రక్క చెప్పలేనంత భయంవేసి వళ్లంతా చెమటతో తడిసిపోయింది. గుండెల్లో గునపం గుచ్చినంత బాధ కలిగింది.

సురేష్ కూడా అందరి మగాళ్లలాంటి వా డేనా? అతన్ని తప్పుగా అంచనా వేసానా? అని మనసులోనే దుఃఖించాను. అనుకోకుండా చెప్ప లేనంత నిరుత్సాహం నాలో చోటుచేసుకుంది. మళ్లీ నిరాశ, నిస్పృహలతో నా మెదడు వేడె క్కడం మొదలుపెట్టింది. నొప్పితో తల ఎక్కడ చిట్లిపోతుందోననిపించింది. బిగ్గరగా ఏడ్చే సాను. మనస్సు కాస్త నెమ్మదించినట్లయింది. కాస్త ముఖం కడుక్కుని, తిరిగి బెడ్‌రూమ్‌లోకి వచ్చేసరికి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర రెపరెపలా డుతూ ఒక తెల్లకాగితం కన్పించింది. భయాం దోళనలు ముసురుకున్న మనస్సుతో వణుకు తున్న చేతులను అదుపులోకి తెచ్చుకుని ఆతృత గా ఆ కాగితాన్ని అందుకున్నాను. అది సురేష్ వ్రాసిన ఉత్తరం. గుండె దడదడా కొట్టుకోవడం మొదలుపెట్టింది. అయినా ధైర్యం కూడగట్టుకు ని ఉత్తరం చదవడం మొదలుపెట్టాను.

"ప్రియాతి ప్రియమైన శ్వేతకి,

నువ్వు నిద్రలేచేసరికి నేను కన్పించకపోవ డంతో నువ్ ఎంతటి ఆందోళనకు గురి అవు తావో నేను అంచనా వేయగలను. గాఢ నిద్రలో ఉన్న నిన్ను చూసి, నీ అలసిపోయిన శరీరాన్ని చూసి, నీకు నిద్రాభంగం కలిగించడం ఇష్టం

లేక, నువ్వు నన్ను ఎట్టిపరిస్థితుల్లోనూ అపార్థం చేసుకోకూడదనే ఉద్దేశ్యంతో ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

శ్వేతా! నీ ప్రేమ, అనురాగం, మనస్ఫూర్తిగా నువ్వందించిన అనుభవం... నేను ఊహించనిది, జన్మజన్మలకూ మరిచిపోలేనిదీనూ.

ఇక అసలు విషయానికొస్తే నిజానికి నీ కులంగాని, నీ శరీరఛాయగాని అసలు నా ఆలోచనల్లోనే లేవు. ఒక స్త్రీ గురించి నేను ఇంతగా ఎప్పుడూ ఆలోచించలేదంటే నీకు ఆశ్చర్యం కలగకమానదు. నీ ఆత్మీయత, అనురాగం, ప్రేమ నన్ను మరోవైపు కదలకుండా చేసాయి. నిర్మలమయిన మనస్సుతో, నిజాయితీగా నీకు మాట ఇస్తున్నాను. నిన్ను నేను పెళ్లిచేసుకుంటాను. నువ్ ఇష్టపడితేనే సుమా! జీవితాంతం నిన్ను గతం అంతా మరిచిపోయేలా సుఖపెడతాను. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను.

కాని నువ్వు నన్ను పెళ్లి చేసుకుంటే కొన్ని విషయాలు త్యాగం చేయవలసి వస్తుందేమో! భయపడ్తున్నావా? అయినా చెప్పక తప్పదు. నా వల్ల నీకు సంతానం కలిగే అవకాశం లేదు. చిన్నప్పుడు దెబ్బ తగలడం వల్ల నాకు ఈ దుస్థితి ఏర్పడింది. అయితే సంసారసుఖానికి ఇదే మాత్రం అడ్డుకాదని అప్పుడే డాక్టర్లు తేల్చిచెప్పారు. ఈ విషయం నా తల్లిదండ్రులకు కూడా నేను చెప్పుకోలేదు. చెప్పినా వాళ్లకి అర్థం కాదని నాకు తెలుసు.

ఇంతకాలంగా నేను 'పెళ్లి' ఎందుకు వద్దంటున్నానో వాళ్లకి తెలియదు. పెళ్లి చేసుకుని 'ఆమె'ని ఉసురుపెట్టడం ఇష్టంలేక యింతకాలం గడిపేసాను. పరిస్థితిని అర్థంచేసుకునే పరిజ్ఞానం నీకు ఉంది గనుక, ఈ వివరాలన్నీ నీకు వ్రాస్తున్నాను. ఇంత తెలిసిన తరువాత కూడా నీ జీవితానికి నా తోడు మంచిదే అనుకుంటే నిన్ను నాదానిగా చేసుకోవడానికి నా హృదయ గవాక్షం తెరిచే ఉంచాను. ఈ విషయంలో నిన్ను మోసగించాననో, తప్పుదోవ పట్టించాననో నువ్వు అనుకుంటే అందుకు క్షంతవ్యుణ్ని. నీ నుంచి ఏదో ఒక సమాధానం వచ్చేవరకూ నీ ముఖం చూడలేను నేను. త్వరలో నీ అభిప్రాయం వెల్లడిస్తావు కదూ!

నీ కోసం నిరంతరం తపిస్తూ, నీవాడు - సురేష్".

ఉత్తరం చదవడం పూర్తయిన తరువాత తల బరువు దిగి, మనసు తేలికయినట్లయింది. ముఖానికి పట్టిన చమట వల్ల గాలికి చల్లగా హాయిగా అన్పించింది.

"నా సురేష్, నిన్ను ఎట్టి పరిస్థితుల్లోనూ నేను వదులుకోను. పిల్లలు కావాలనుకుంటే ఏ అనాథనో పెంచుకోవచ్చు. ఈ రకంగా నేనేదో త్యాగం చేస్తున్నానని కూడా నువ్వు అనుకోనక్కరలేదు.

నాకు నువ్వు కావాలి. నీ ప్రేమ కావాలి. నిరంతరం నీ మృదుమధుర స్పర్శతో నీ వడిలో వాలి హాయిగా నిద్రపోవాలి. ఇంతకుమించిన పెద్ద కోర్కెలంటూ నాకు లేవు. ఇప్పటివరకూ నేను ఏది కోల్పోయానో, అది మాత్రమే నేను నీ నుంచి ఆశిస్తున్నాను. సాటి ఆడదానిగా సంతోషంగా, గర్వంగా నేను సమాజంలో తిరగగలగాలి. అంతే... అంతే చాలు నాకు. థాంక్స్ సురేష్... థాంక్స్!!" అని మనస్సులోనే అనుకున్నాను.

స్నానంచేసి, ఫ్రెష్‌గా తయారయి, సురేష్‌కి నా నిర్ణయం వ్రాయడానికి ఉపక్రమించాను.

రెండు కన్నీటిబొట్లు టప్... టప్... మని బరువుగా కాగితంమీద పడ్డాయి. ●